క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పాన్‌గల్: మండల కేంద్రంలో సోమవారం మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ చందన్ కుమార్‌రెడ్డి ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలో విద్యుత్ లైనింగ్ పనుల నిర్వహణతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



పాన్‌గల్: తమతో పాటు కలిసి చదువుకున్న స్నేహితుడు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందటతో కుటుంబాన్ని ఆదుకునేందుకు మిత్ర బృందం ముందుకొచ్చింది. మండలంలోని శాగాపూర్ చెందిన రాములు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడటంతో 1997–98 పదో తరగతి మిత్ర బృందం కలిసి రూ.లక్షను కూతురు పేరు మీద ఎఫ్‌డీ చేశారు. ఆదివారం వాటి పత్రాలను మృతుడి భార్య లక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో చంద్రమౌళి, గోవర్ధన్, రాములు, సహదేవుడు, బషీర్, బాలరాజు, ఇంతియాజ్, కుర్మయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ల పంపిణీ

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని వెంకటాపురంలో కాంగ్రెస్ నాయకులు క్యాలెండర్లను గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో శంకర్‌నాయుడు, శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్, కురుమన్న, ప్రవీణ్, దశరథం, చింతలయ్య, పెంటన్న తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

కోస్గి: పట్టణంలోని తిమ్మన బావి శివాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 14 నుంచి 19 వరకు శివపార్వతుల కల్యాణ మహోత్సవంతోపాటు శ్రీ నాభి శిలా(బొడ్రాయి) విగ్రహప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా 14న మంగళవారం గణపతి గౌరీ పూజ, గోపూజ, అఖండ దీపారాధన, స్వస్తి పుణ్యాహవాచనం, యాగశాల ప్రవేశం, రుత్విగ్వరణము, విగ్రహాభిషేకం, జలాధివాసం, మంగళహారతి కార్యక్రమం ఉంటుందన్నారు. 15న బుధవారం సర్వతోభద్ర మండపారాధన, లక్ష్మీ గణపతి హవనం, దేవి హోమం, విగ్రహాభిషేకం, ధాన్యాధివాసం, మంగళహారతి, 16న గురువారం యంత్ర ప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ అనంతరం విగ్రహ సందర్శన, పూర్ణాహుతి, మహా మంగళ హారతి, వేదాశీర్వచనం, తీర్థ ప్రసాద వితరణ, అన్నదాన కార్యక్రమ అనంతరం సాయంత్రం శ్రీ నాభి శిలా(శీతలదేవి) అమ్మవారికి బోనాలు సమర్పణ ఉంటుందన్నారు. అదేవిధంగా 17న వీరభద్ర స్వామి అభిషేకం, శివపార్వతుల కల్యాణం, అన్నప్రసాద వితరణ, 18న శనివారం మహా శివరాత్రి పర్వ దినాన్ని పురస్కరించుకొని శివాలయంలో అభిషేకం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాల అభిషేకం, 19న ఆదివారం శివస్వాములకు జ్యోతిర్ముడి ధారణతోపాటు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ ప్రతిష్ఠ మహోత్సవం వైదిక తపోనిధి రుద్రాక్షల మఠం అమరలింగ స్వామి ఆధ్వర్యంలో వైదిక రత్న వీరేశలింగం, పరమేష్ శాస్త్రీ, మఠం శివ కుమార్, మఠం వినయ్ కుమార్ సమక్షంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరై విజయవంతం చేయాలన్నారు.

శంకరభారతి తీర్థ స్వామికి ఘన స్వాగతం

నారాయణపేట: మైసూర్ ఎడతొరె యోగానందేశ్వర మఠం పీఠాధిపతి శంకర భారతి తీర్థ స్వామిజీకి మంగళవాయిద్యాలు, పూర్ణకుంభంతో ఆదివారం దీక్షిత్ కుటుంబీకులు, భపట్టణవాసులు, భక్తులు ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలోని పళ్ల విధిలో ఉన్న 800 ఏళ్ల చరిత్రగల నిమజ్జన మెరుగని వినాయకుని దర్శనానికి ఆయన విచ్చేశారు. లక్ష్మీ గణపతి ఉమామహేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. వినాయకున్ని దర్శించుకున్నారు. అనంతరం స్వామికి పాద పూజ, పుష్పాలంకరణ నిర్వహించారు. భక్తులను ఉద్దేశించి ఆధ్యాత్మిక ప్రవచన చేస్తూ ప్రతి ఒక్కరిలో దైవ భక్తి పెరగాలని సన్మార్గంలో నడుచుకోవాలన్నారు.



కనులపండువగా ఈదమ్మ జాతర

- అమ్మవారిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక వంటకాలతో బోనాలు



అలంకరణలో ఈదమ్మ మందాతలు



బోనాలతో గుడిచుట్టు ప్రదక్షిణ చేస్తున్న మహిళలు

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలో ఈదమ్మ జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయాన్నే నిర్వాహకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల ప్రజలతో పాటు భూత్పూర్, అడ్డాకుల, మూసాపేట్, ఇతర మండలాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో ఉత్సవాలకు హాజరయ్యారు. అమ్మవారికి మహిళలు ప్రత్యేక వంటకాలతో తయారు చేసిన బోనంలో నైవేద్యాన్ని తీసుకెళ్లి సమర్పించారు. మరికొంత మంది పొటేళ్లు, కోడిపుంజులు అమ్మవారిముందు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయం వద్ద స్వీట్లు, గాజులు, ఆటవస్తువులు, వంటపాత్రలు, తదితర అంగళ్లు ఏర్పాటు చేశారు. మహిళలు ప్రత్యేకంగా జాతరను పురస్కరించుకుని గాజులు వేయించుకున్నారు. దేవాలయం దగ్గర భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు.



జాతరలో గాజులు కొంటున్న మహిళలు



చిన్నారులకు ఆటవస్తువులు కొంటున్న ప్రజలు



తినుబండారాలను కొంటున్న ప్రజలు

'శాఖాహారం ఆరోగ్యానికి మంచిది'



పెద్దమందడిలో ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ సొసైటీ సభ్యులు

కొత్తకోట రూరల్ (పెద్దమందడి): ప్రతి ఒక్కరూ శాఖాహారం తీసుకోవాలని, దీంతో ఆరోగ్యంగా ఉంటారని పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి మనిషి రోజుకు 4గంటల పాటు ధ్యానం చేస్తూ శ్వాసమీద ధ్యాస ఉంచాలన్నారు. ధ్యానం చేయడం వలన మనస్సు స్థిరంగా ఉండటంతో పాటు కొన్ని రోగాలను నుంచి విముక్తి కలుగుతుందన్నారు. అంతే కాకుండా అజ్ఞానం నుంచి బయటపడే మార్గం దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్, రాధాకృష్ణ, రాములు, చంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' సమ్మేళనం



గట్టు: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2006–07 సంవత్సరంలో పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. ప్రస్తుతం ఏ ఉద్యోగం చేస్తున్నారో, ఎక్కడ స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు. అప్పటి విద్యాబుద్ధులు నేర్పిన గురువులు అమరేష్‌బాబు, కృష్ణయ్య, వెంకన్న, భాస్కర్, మద్దిలేటి, శ్రీనివాసులు, నాగేష్‌బాబు, రామచంద్రరావు, శేఖర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, జాఫర్‌లను ఘనంగా సన్మానించారు.

వైభవంగా పోచమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన



బోనాల ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలోని న్యూమోతీనగర్‌లో పోచమ్మ అమ్మవారి పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. తాళ్లపాక మణికంఠ శివాచార్య ఆచార్యత్వంలో ప్రతిష్ఠాపన మహోత్సవ పూజలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం గవ్యాంత పూజలు, యంత్రస్థాపన, బింబస్థాపన, మూల మంత్ర హోమాలు, మహాపూర్ణాహుతి, ప్రాణప్రతిష్ఠ, మహాకుంబాభిషేకం, నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజలు చేశారు. సాయంత్రం భక్తిశ్రద్ధలతో బోనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపు నిర్వహించి, అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మవిశ్వాసం పెంపు

మహబూబ్‌నగర్ క్రీడలు: కరాటే మార్షల్ ఆర్ట్స్‌తో దేహదారుఢ్యం పెంపుతో పాటు మానసికంగా ధృడంగా ఉండవచ్చని రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ అన్నారు. శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఫౌండర్, సీనియర్ మాస్టర్ కె.వెంకటేశ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని మోడల్ బేసిక్ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎన్‌పీ వెంకటేశ్ మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం, ఆత్మరక్షణ కోసం కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవాలన్నారు. పిల్లలు కరాటే నేర్చుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఫౌండర్ కె.వెంకటేశ్ మాట్లాడుతూ కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలో విద్యార్థులు ప్రతిభచాటినట్లు తెలిపారు. 12 మంది విద్యార్థులు ఎల్లో బెల్టు, 9 మంది విద్యార్థులు ఆరెంజ్ బెల్టులు సాధించినట్లు తెలిపారు.

భారంగా మారిన సాగు

- గిట్టుబాటు కావడం లేదని ఆవేదన
- పెరిగిన ఎరువుల ధరలు



ట్రాక్టర్‌తో కరిగెట చేస్తున్న రైతు(ఫైల్)

కేటీదొడ్డి: రోజురోజుకు పెరుగుతున్న ధరలతో మండలంలోని సన్న, చిన్నకారు రైతులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. వ్యవసాయ పనిముట్లతో పాటు ఎరువులు ధరలతో రైతులు సతమతం అవుతున్నారు. సాగు చేసేందుకు కొంతమంది రైతులు వెనుకంజ వేస్తున్నారు. ధరల పెరుగుదలతో పంటల సాగు ఖర్చు అధికమవ్వడంతో గిట్టుబాటు కావడం లేదని మండల రైతులు వాపోతున్నారు. మండలంలో 16200 ఎకరాలలో వివిధ పంటలు సాగుచేశారు. మండలంలో 4800 చిన్నకారు, 3800 పెద్దకారు రైతులు ఉన్నట్లు వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు. పంటల సాగు రైతులకు మరింత భారం మారింది. రోజురోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు రైతులను బెంబేలెత్తిస్తున్నాయి. వీటికి తోడు ఎరువులు, పురుగు మందుల ధరలు పెరగటంతో సాగు పెట్టుబడి మరింత భారం అయ్యింది.

డీజిల్ ధరల ప్రభావం

పెట్రోల్, డీజిల్ ధలర పెంపు ప్రత్యక్షంగా, పరోక్షంగా పంటల సాగుపై ప్రభావం చూపుతుంది. దుక్కులు దున్నటం, పురుగు మందుల పిచికారీ, ఎరువులు, కూలీల తరలింపు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు రైతులు పూర్తిస్థాయిలో ట్రాక్టర్లపైనే ఆధారపడుతున్నారు. డీజిల్ ధరల పెంపు కారణంగా ట్రాక్టర్ల కిరాయిలు పెంచారు. దీంతో పరోక్షంగా రైతులపై పెట్టుబడి భారం పెరిగింది. మరోవైపు ఎరువుల తయారీకి వినియోగించే ముడి సరుకు ధరలు పెరిగాయి. దీంతో 50 కిలోల బస్తాల ఎరువుల ధరను రూ. 250 నుంచి రూ. 500 వరకు పెంచారు. కాంప్లెక్స్ ఎరువులపై రాయితీలను తగ్గింపుతో ధరలు పెంచుతున్నారని మండల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకేసారి 20 శాతం వరకు పెంచటంతో రైతులు దిగులు చెందుతున్నారు.

పెట్టుబడులు పెరిగాయి

పంటల సాగుకు పెట్టుబడులు పెట్టలేకపోతున్నాం. డీజిల్ ధరలు పెరగటంతో ట్రాక్టర్ల కిరాయిలు పెంచారు. ప్రస్తుతం ఎకరం సాగు చేసేందుకు సుమారు రూ.5 వేల వరకు పెట్టుబడి అవుతోంది. దీనికి తోడు ఎరువులు, పురుగు మందుల ధరలు కూడా పెరిగాయి. పంటల సాగు చేయాలంటే భయంగా ఉంది.

– స్వామి, రైతు కేటీదొడ్డి

ఎరువులు కొనలేకపోతున్నాం



ఎరువుల ఖర్చు ఎక్కువవుతోంది. 50 కిలోల బస్తా రూ.1400 నుంచి రూ.1500 వరకు ఉంది. ఎరువులకే ఎకరాకు రూ. 10 వేల పెట్టుబడి పెట్టాల్సి వస్తోంది. పురుగు మందుల ధరలు కూడా రెట్టింపు అయ్యాయి. ధరల కారణంగా పంట గిట్టుబాటు రావడం కష్టమే.

– సద్దల వీరన్న, రైతు కేటీదొడ్డి

లక్ష మెట్రిక్ టన్నుల ఎరువుల వినియోగం

మండల వ్యాప్తంగా వానాకాలం యాసంగి పంటల సాగుకు రైతులు సుమారు లక్ష మెట్రిక్ టన్నుల ఎరువులను వినియోగిస్తున్నారు. ఇందులో కాంప్లెక్స్ ఎరువులు, డీఏపీ, యూరియా, పొటాష్ తదితర ఎరువులున్నాయి. ప్రస్తుతం 50 కిలోల డీఏపీ ధర రూ. 1400కు చేరింది. 20–20–013 ఎరువు ధర రూ. 1400కు చేరగా 14–35–14 రూ. 1500, 28–28–0 రూ.175కు 10–26–26కు రూ.1500కు చేరింది. పంటల సాగులో ఎరువుల కంటే పురుగు మందులకే ఎక్కువ పెట్టుబడులు పెడుతున్నామని సన్న, చిన్నకారు రైతులు పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఇరుముడి పూజలు

ఆత్మకూర్: నియమ నిష్ఠలతో శివ దీక్ష పొందిన మాలధారులు ఆదివారం ఇరుముడి మహోత్సవం నిర్వహించారు. పట్టణంలోని బాలబ్రహ్మేశ్వరస్వామి, నీలకంఠేశ్వరస్వామి ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. పూజలకు హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం మాలధారులు పాదయాత్రగా శ్రీశైలం సన్నిధికి తరలివెళ్లారు. మాజీ ఎమ్మెల్యే దయాకర్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ రమేష్ పాల్గొన్నారు.

పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లి శివాలయంలో ఆదివారం శివస్వాముల ఇరుముడి కార్యక్రమం నిర్వహించారు. ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన శ్రీశైలానికి పాదయాత్రగా బయలుదేరి వెళ్లారు.

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండల కేంద్రంలోని శివాలయంలో శివ మాలధారులు మహాపడి పూజ ఆదివారం నిర్వహించారు. అనంతరం పూజారులు ఇరుముడి చేపట్టారు.



ఆత్మకూరు నుంచి శ్రీశైలానికి బయలుదేరిన శివమాలధారులు

అంతరపంటలపై రైతుల ఆసక్తి



చీని తోటల్లో అంతరపంటగా వేరుశనగ సాగు

ధరూరు: మండలంలోని ఆయా గ్రామాల శివారులో పండ్ల తోటలను సాగు చేసిన రైతులు అదే పొలాల్లో అంతర పంటగా వివిధ రకాల ఆరుతడి పంటలను సాగు చేసుకుంటున్నారు. ఒకే పొలంలో రెండు పంటలను సాగు చేసుకుంటూ లాభాలను గడిస్తున్నారు. ప్రధానంగా చీని, మామిడి తోటల్లో అంతర పంటల సాగు ఈ మధ్య కాలంలో పెరిగింది. పండ్ల తోటల్లో వేరుశనగ, బొబ్బెర్లు వంటి ఆరుతడి పంటలను సాగు చేస్తున్నారు. అంతర పంటగా వేసిన సాగుతో లాభాలు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. ధరూరు, మన్నాపురం, చింతరేవుల, వామన్‌పల్లి, పారుచర్ల, చిన్నపాడు తదితర గ్రామాల్లో అంతర పంటల సాగు అధికంగా ఆసక్తి కనబరుస్తున్నారు.

కంకర వేశారు.. బీటీ మరిచారు



పుల్లూరు- కలుగోట్ల రహదారి

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరు నుంచి కలుగోట్ల వయా మెన్నిపాడు వరకు బీటీ నిర్మాణంతో పాటు వంతెన ఏర్పాటు కోసం రూ.1.50 కోట్ల నిధులతో 2022 సంవత్సరంలో ఎంపీ రాములు పనులను ప్రారంభించారు. మొదట్లో రహదారి పనులు ముమ్మరంగా పనులు కొనసాగాయి. బీటీ పనుల్లో భాగంగా కంకర వేశారు. ఇంతవరకు బాగానే ఉన్న మిగతా పనులు కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారు. దీంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. కంకర తేలిన రోడ్డుతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్న సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి వంతెన, బీటీ నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి

మల్దకల్: మండలంలోని నాగర్‌దొడ్డి స్టేజీ సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద సూచికబోర్డు లేకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సూచికబోర్డులను ఏర్పాటు చేయలేదని వాపోయారు. వందలాది వాహనదారులు ఈ రహదారిపై రాకపోకలు కొనసాగిస్తుంటారు. రాత్రివేళలో కల్వర్టు సమీపంలో ఉన్న గుంత కనిపించక అందులో పడి ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించిప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



నాగర్‌దొడ్డి సమీపంలో కల్వర్టు వద్ద ఇలా..

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కేశవరావు

అలంపూర్: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతామని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కేశవరావు అన్నారు. ఆదివారం అలంపూర్ చౌరస్తాలోని బీఎస్పీ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ బీఎస్పీ నాయకులు ప్రశ్నించే వరకు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం కనిపించలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పార్టీ నాయకులు తుమ్మిళ్లపై సవతి ప్రేమ చూపించారని విమర్శించారు. అధికారం పోయాక కపట ప్రేమ చూపిస్తున్నారని దుయ్యబట్టారు. బీఎస్పీ పోరాటాలతోనే తుమ్మిళ్ల సాగునీరు వదిలారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధి చూపించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షుడు మహేష్, నాయకులు సుంకన్న, కనకం బాబు, లక్ష్మన్న, నాగరాజు తదితరులు ఉన్నారు.